క్లుప్తంగా

కోదండ రామాలయంలో జలాభిషేకం



ఊనగట్లలో కలశాలతో మహిళలు

చాగల్లు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఊనగట్ల శ్రీ కోదండ రామాలయంలో స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం శాఖరాన్ని నదీ జలాలతో అభిషేకించారు. ముందుగా 108 కలశాలతో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల10న స్వామి వారి ఊరేగింపు, 14న అన్నస మారాధన నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రాహ్మణగూడెంలో రామాలయంలో మహిళల ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు.

నేత్ర వైద్య శిబిరం

తాళ్లపూడి: అన్నదేవరపేటలో మంగళవారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. అందులో రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆస్పత్రి ద్వారా 12 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నేత్ర వైద్యుడు నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దుగ్గిరాల శ్రీనివాస్, కుంటముక్కల వీరభద్రరావు, మారిన రామ్మూర్తి, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

నిడదవోలు: పట్టణంలోని 9వ వార్డు సచివాలయం ఉద్యోగి మృతిపై సమగ్ర విచారణ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి సచివాలయం ఉద్యోగి స్వగ్రామం కోరుమామిడిలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనప్పటికీ ఇంటి వద్దే హఠాత్తుగా మరణించటం పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయని ఆయన అన్నారు. కుటుంబ సభ్యులు పలు రకాలుగా పొంతనలేని విషయాలు చెప్పడంతో మరింతగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు.

శిలాఫలకాలకే పరిమితమా!

ప్రొటోకాల్ ఉల్లంఘనపై వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల అసంతృప్తి

నల్లజర్ల: మండలంలో సోమవారం రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వివిధ గ్రామాల్లో పర్యటించి రూ.8.65 కోట్లతో ఏర్పాటు చేసే నాలుగు బీటీ రహదారులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎక్కడా ప్రొటోకాల్ పాటించలేదని వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, మార్లెమూడి సర్పంచ్ ప్రగడ సుబ్రహ్మణ్యేశ్వరి మాట్లాడారు. ఆయా కార్యక్రమాలకు తమను ఆహ్వానించలేదన్నారు. కనీసం ఫోన్ చేసి ఆహ్వానించినా తాము హాజరయ్యేవారమని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కొత్త సంప్రదాయానికి తెరతీశారని, ఇదేనా స్థానిక ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఈ తరహా తప్పిదాలకు ఎప్పుడూ పాల్పడలేదన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే వచ్చినపుడు గ్రామ సమస్యలు విన్నవించుకునే అవకాశం ఉంటుందని, దీనిని దూరం చేశారని వారు ఆరోపించారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం



మలకపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మలకపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పిల్లిపెసర, పచ్చి రొట్ట విత్తనాలు సరఫరా చేయాలని, టార్పాలిన్లు అందించాలని రైతులు కోరారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు నామన పరమేశ్వరావు, మండల జనసేన అధ్యక్షుడు గంటా కృష్ణ, ఏడీఏ పి.చంద్రశేఖర్, ఏవో జి.రుచిత, నాయకులు మద్దిపాటి ప్రకాశం ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

నల్లజర్ల: గుడ్‌లాం, చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం నల్లజర్ల, అనంతపల్లి గ్రామాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్‌లాం ప్రోగ్రాం మేనేజర్ జీసీకే మూర్తి మాట్లాడుతూ, రక్త మార్పిడి, అసురక్షిత శృంగారం వల్ల ఈ వ్యాధి సంక్రమించే అవకాశం ఉందన్నారు. వ్యాధిగ్రస్తులు ఏఆర్టీ కేంద్రాల్లో చికిత్స పొందితే వైరస్ ప్రభావం తగ్గే అవకాశం ఉందన్నారు. ఇది ప్రాణాంతకం కాదని, నిత్యం వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.

జీడిమామిడికి పొగ మంచు దెబ్బ

- మాడిపోయిన పూత
- వెలవెలబోతున్న తోటలు
- కానరాని లేత పూతలు
- కౌలు రైతులు విలవిల



దేవరపల్లి మండలం పల్లంట్లలో మంచు దెబ్బకు మాడిపోయిన జీడిమామిడి పూత (అంతర చిత్రం) జీడిమామిడి కాయలు

దేవరపల్లి: జీడిమామిడి పంటకు మంచు దెబ్బ తగిలింది. మార్చి నెలలో కురిసిన మంచుకు జీడిమామిడి పూతలు మాడిపోయి తోటలు వెలవెలబోతున్నాయి. ఫిబ్రవరి, మార్చి మొదటి వారం వరకు విరగబూసిన పూతలతో జీడిమామిడి తోటలు కళకళలాడటంతో రైతులు ఆనందపడ్డారు. జీడిమామిడి పూత బాగుండడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశపడ్డారు. దాదాపు వారం రోజులపాటు రాత్రి సమయంలో వర్షాన్ని తలపించేలా మంచు కురవడంతో పూతలు మాడిపోయినట్టు రైతులు తెలిపారు.

మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట

జిల్లాలోని మెట్ట ప్రాంతంలో జీడిమామిడి పంటను వర్షాధార పంటగా సాగు చేస్తున్నారు. ఒకసారి మొక్క వేస్తే దాదాపు 40 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. మెట్ట భూములు, కొండ ప్రాంతాలు, ఇసుక నేలల్లో జీడిమామిడిని రైతులు సాగు చేస్తున్నారు. ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో పూతలు వచ్చి, ఏప్రిల్, మే నెలల్లో గింజలు తయారవుతాయి. రెండు నెలలు పంట దిగుబడి ఉంటుంది. వంగడాన్ని బట్టి ఎకరాకు 4 నుంచి 10 బస్తాల దిగుబడిని రైతులు సాధిస్తున్నారు. నాటు రకాలు ఎకరాకు 4 బస్తాలు దిగుబడి వస్తుండగా, హైబ్రిడ్ రకాల వంగడాలను సాగు చేస్తున్న రైతులు 10 నుంచి 12 బస్తాల దిగుబడి సాధిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో వరి సాగు తర్వాత అధిక శాతం రైతులు జీడిమామిడిని ప్రధాన వాణిజ్య పంటగా పండిస్తున్నారు.

జీడిమామిడి తోటలను తొలగించి పొగాకు సాగు

రెండేళ్లుగా పొగాకు పంటకు మార్కెట్లో మంచి ధర పలకడం, జీడిమామిడి దిగుబడులు తగ్గడంతో గిట్టుబాటు కాకపోవడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు జీడిమామిడి తోటలను తీసివేసి పొగాకు సాగు చేపట్టారు. కౌలు ఎకరాకు రూ. 80 వేలు పలకడంతో పెద్ద రైతులు జీడిమామిడి తోటలను తీసివేసి భూములను కౌలుకు ఇవ్వడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో జీడిమామిడి పంట కనుమరుగవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులు కుదేలు

జీడిమామిడి తోటలను కౌలుకు తీసుకున్న రైతులు కుదేలయ్యారు. ఎకరం తోట రూ. లక్షకు కౌలుకు తీసుకుని, మరొక రూ.25 వేలకు పైగా రైతులు పెట్టుబడి పెట్టారు. పూతలు మాడిపోయి వెలవెలబోతున్న తోటలను చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది రైతులు 10 నుంచి 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. మార్కెట్లో గింజల ధర బాగున్నప్పటికీ తోటల్లో గింజలు లేవని రైతులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు

జీడిమామిడి పంట గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే చాల మంది రైతులు జీడిమామిడికి ప్రత్యామ్నాయంగా వర్జీనియా పొగాకు, ఆయిల్‌పామ్, కోకో, కొబ్బరి పంటలను సాగు చేస్తున్నారు. శ్రమ, పెట్టుబడి లేకుండా ఎకరాకు భూయజమానికి రూ. 80 వేల వరకూ కౌలు ఆదాయం రావడంతో వారు కౌలుకు ఇస్తున్నారు. ప్రస్తుతం జీడిమామిడి సాగులో పెట్టుబడి పోను ఎకరాకు రూ. 20 వేలు కూడా మిగలడం కష్టంగా ఉందని రైతులు తెలిపారు.

9 వేల హెక్టార్లలో జీడిమామిడి సాగు

కొవ్వూరు డివిజన్‌లోని నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లోని ఎనిమిది మండలాల్లో 9 వేల హెక్టార్లలో రైతులు జీడిమామిడి సాగు చేస్తున్నారు. ద్వారకాతిరుమల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో జీడిమామిడి తోటలున్నాయి. ద్వారకాతిరుమల మండలంలో 2,300 హెక్టార్లు, దేవరపల్లి మండలంలో 1,352 హెక్టార్లు, గోపాలపురం మండలంలో 1,198 హెక్టార్లు, నల్లజర్ల మండలంలో 700 హెక్టార్లు, చాగల్లు మండలంలో 900 హెక్టార్లు, తాళ్లపూడి మండలంలో 330 హెక్టార్లు, కొవ్వూరు మండలంలో 170 హెక్టార్లలో జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు.

జీడి గింజల ధర ఆశాజనకం

జీడి గింజల ధర ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం నాటు గింజలకు డిమాండ్ అధికంగా ఉంది. బస్తా (80 కిలోలు) గింజలు రూ.15 వేలు పలుకుతోంది. పూతలు మాడిపోయి కాపు లేకపోవడంతో గింజల కొరత ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో జీడిపప్పు పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు నాటు గింజలను కొనుగోలు చేస్తున్నారు. అవసరాలకు సరిపడగా పంట ఉత్పత్తి లేకపోవడం వల్ల గింజల కొరత ఎక్కువగా ఉందని వ్యాపారులు అంటున్నారు.

మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం



ఈ ఏడాది జీడిమామిడి రైతులకు మందులు, కూలీల ఖర్చులు కూడా వచ్చేలా లేదు. ఎకరాకు బస్తా గింజలు కూడా దొరకని పరిస్థితి. మంచుకు పూతలు మాడిపోయింది. నాలుగు దఫాలుగా పురుగు మందులు పిచికారీ చేసినా పూత నిలవలేదు. సాధారణంగా ఎకరాకు 10 ఉంచి 12 బస్తాల దిగబడి వచ్చేది. ఈ ఏడాది బస్తా గింజలు కూడా రావడం లేదు. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాం. గింజల ధర బాగున్నప్పటికీ దిగుబడి తగ్గింది.

– లకంసాని శ్రీనివాస్, రైతు, చిన్నాయగూడెం, దేవరపల్లి మండలం

వాతావరణం మార్పుతో తీవ్ర నష్టం



జీడిమామిడి తోటలను కౌలుకు తీసుకుని నష్టపోయాను. పూతలు బాగుండడంతో ఎకరా రూ. 50 వేలకు 25 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఎకరాకు రూ. 30 నుంచి రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. పూత నిలిచేందుకు ఎనిమిది సార్లు మందులను పిచికారీ చేసినా ఫలితం లేదు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల పూత పూర్తిగా మాడిపోయింది. కౌలుదారులు కోలుకోవడం కష్టం.

– కోలమూరి వెంకటేష్, రైతు, లక్ష్మీపురం, దేవరపల్లి మండలం

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పాఠ్య పుస్తకాలు అందజేత

తాళ్లపూడి: ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించామని, హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోకి వెళ్లిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్ చేతుల మీదుగా 110 మందికి ఉచిత పాఠ్య పుస్తకాలను మంగళవారం అందజేసారు. ఈ సందర్భంగా 2025– 2026 విద్యాసంవత్సరంలో ఇంటర్ తరగతులు ప్రారంభించిన నేపథ్యంలో పదవ తరగతి పరీక్షలు రాసి ఇంటర్‌లో చేరాలనుకునే వారందరూ పరీక్షా ఫలితాలతో సంబంధం లేకుండా ఇంటర్‌లో చేరే అవకాశం కల్పిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులతో పాటు ఈ ఏడాది ఎంబైపీసీ కోర్సు కూడా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన ఉంటుందన్నారు. సైన్స్ గ్రూప్‌లకు రూ.2,409, ఆర్ట్స్ గ్రూపులకు రూ.1,419 చొప్పున ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. అడ్మిషన్లు పొందిన వారందరికీ టెక్స్టుబుక్స్, స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్, ల్యాబ్ రికార్డులు, బ్యాగ్, ప్రభుత్వం నుంచి అందిస్తామని తెలిపారు. కళాశాలలో ఇంటర్‌లో చేరగోరే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు.

పాఠశాలను విలీనం చేస్తే సహించం



పెరవలి మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పెరవలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరనే నెపంతో ఉన్న పాఠశాలలను మూసి వేయటం దారుణమని దీనిని బీఎస్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. పెరవలి మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద మంగళవారం బీఎస్పీ నాయకులు నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు చల్లాబత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ అజ్జరంలో పాఠశాల-2ను మోడల్ స్కూల్ నెపంతో విలీనం చేయడాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ పాఠశాలను విలీనం చేయవద్దని గతంలో గ్రామ పెద్దలు తీర్మానించి అధికారులకు తెలిపారని గుర్తు చేశారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వరరావు, పాలంగి సంపతరావు, కప్పల ఇజ్రాయిల్, గంటి శ్రీను, ఏలూరి అశోక్ కుమార్, గొల్ల దనరాజు, సిర్రా రాజు, గూడపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



నల్లజర్లలో సమావేశమైన విశ్రాంత ఉద్యోగులు

నల్లజర్ల: కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశ పెట్టిన పింఛన్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం నల్లజర్లలో మండల శాఖ అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ బిల్లు ఆమోదం పొందితే పెన్షనర్లకు ఎటువంటి పెరుగుదల ఉండదని కేవలం కరువు భత్యం మాత్రమే పెరుగుతుందన్నారు. పే రివిజన్ కమిషన్ సిఫారసులు పాతవారికి వర్తించవని, ఆ కమిటీ కాలంలో ఉద్యోగ విరమణ చేసిన వారికే లబ్ధి కలుగుతుందన్నారు. కోట్లాది మంది పింఛను దారులకు కీడు కలిగించే ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పింఛన్ పితామహుడు నకారా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎస్.యం.ఆలీ సాహెబ్, కామేశ్వరావు, ప్రభుదాసు, బాలయ్య, దత్తు మేడమ్, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవత డైరెక్టరీ ఆవిష్కరణ



నల్లజర్లలో మానవత డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన 2024–25 డైరెక్టరీని నల్లజర్ల లిబర్టీ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఏకేఆర్జీ కళాశాలలో ఇంటర్ చదువుతున్న బండారు రజని ఆర్థిక పరిస్థితులతో ఫీజులు చెల్లించలేకపోయింది. ఈ విషయం మానవత సభ్యులు గుర్తించి ఆమెకు రూ.20 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. అచ్చన్నపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొప్పర్తి రజనీకి రూ.4 వేలు సాయంగా అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ, భోగవల్లి వెంకటసుబ్బారావు, గుత్తికొండ వరప్రసాద్, గుళ్ళపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, నందం రాజేంద్రప్రసాద్, పాతూరి సత్యనారాయణ, దాపర్తి శివ, నెక్కలపూడి ప్రతాప్, పాతూరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

తాళ్లపూడి: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ గ్రామాలు కార్యక్రమాల్లో భాగంగా తాళ్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం పరిసరాల పరిశుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న తడి చెత్త, పొడి చెత్త సేకరణ ఆవశ్యకతను వివరించారు. పరిశుభ్రమైన పరిసరాల్లో ఆరోగ్యంగా జీవించవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న జాతీయ మెగా లోక్ అదాలత్

కొవ్వూరు: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 10న కొవ్వూరు కోర్టుల్లో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తామని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ తెలిపారు. మంగళవారం న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ చేసుకోదగిన కేసులన్నీ ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకోవడం ద్వారా ఖర్చులతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను, కుటుంబ తగాదాలను, భార్యభర్తల భరణం, గృహ హింస కేసులు, మోటారు వాహనాలు కేసులు, ప్రమాదాలు, బ్యాంకు బకాయిలు, ప్రామిసరీ నోట్ కేసులన్నీ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

ఏఐపై అవగాహన పెంచుకోండి

కొవ్వూరు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది కంప్యూటర్ యంత్రాల ద్వారా మానవ మేధస్సును అనుకరించే సామర్థ్యమని దీనిపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ నెక్కంటి శ్రీనివాస చక్రవర్తి సూచించారు. పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఏఐ ద్వారా విద్యార్థులకు సబ్జెక్టుల బోధనపై రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు వర్క్ షాపు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామ్మోహన్‌రావు, సహాలదారుడు ఏవీ సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

వరపల్లి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని రాత్రి 7 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగానూ, స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి మండపంలోని పెండ్లిపీటపై ఆశీనులను చేశారు. పండితులు కల్యాణ తంతు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. యర్నగూడెంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కొవ్వూరు: వేములూరు గ్రామ శివారున పొలాల్లో పేకాడుతున్న ఐదుగురు జూదరులను మంగళవారం అదుపులోకి తీసుకున్నామని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.వీరి నుంచి రూ.1,560 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ కళాశాలలో నేడు జాబ్‌మేళా

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్, డైకిన్ ఏసీ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్, కాకినాడ, విశాఖపట్నం సమీపంలోని బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో ట్రైనీ సూపర్‌వైజర్ ఉద్యోగాలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌గా పనిచేసేందుకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్ (కెమికల్), ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ/ అనలైటికల్ కెమిస్ట్రీ), ఎం. ఫార్మసీ అర్హతలు గల 21 నుంచి 25 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శ్రీ సిటీలోని ప్రముఖ డైకిన్ ఏసీ కంపెనీలో పని చేసేందుకు 10వ తరగతి, ఇంటర్ పాస్/ ఫెయిల్, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయిన 18 నుంచి 27 ఏళ్లలోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి తెలిపారు. వివరాల కోసం కోఆర్డినేటర్ బి. సౌజన్య 73386630918, 9441228550, 9840332850 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అల్పాహారం, మజ్జిగ పంపిణీ

కొవ్వూరు: పట్టణంలో మాతృశ్రీ అనసూయదేవి జన్మదినోత్సవం సందర్భంగా భక్తులు అంబిక అష్టోత్తరం, లలితా సహస్ర పారాయణ నిర్వహించారు.భక్తులు పులిహోర, స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. గుడివాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు సలాది సందీప్ కుమార్, గుడివాక రామకృష్ణ కుమార్, శివరామ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

S.S.C సర్టిఫికెట్ పోయినది

తూ॥గో॥ జిల్లా,గోపాలపురం మండలం, గోపాలపురం గ్రామానికి చెందిన వింత అమర ప్రసాద్ రెడ్డి S/O సత్యన్నారాయణ రెడ్డి అను నాకు చెందిన ఒరిజినల్ SSC సర్టిఫికెట్ రోల్ నం. 0150201 జిరాక్స్ కొరకు ఇంటి నుండి గోపాలపురం సెంటర్కు వెళుచుండగా పోయినది కావున దొరికిన వారు అందజేయకోరుచున్నాను

ఇట్లు.... వింత అమర ప్రసాద్ రెడ్డి, గోపాలపురం

S.S.C సర్టిఫికెట్ పోయినది

తూ॥గో॥జిల్లా, గోపాలపురం మండలం, గోపాలపురం గ్రామానికి చెందిన గోలి శ్రావణి D/O మోహన్ రెడ్డి అను నాకు చెందిన ఒరిజినల్ SSC సర్టిఫికెట్ రోల్ నెంబర్ 0658743 జిరాక్స్ కొరకు ఇంటి నుండి గోపాలపురం సెంటర్ కి వెళ్ళుచుండగా పోయినది కావున దొరికిన వారు అందజేయకోరుచున్నాను

ఇట్లు.... గోలి శ్రావణి, D/O మోహన్ రెడ్డి W/O వింత అమర ప్రసాద్ రెడ్డి


అకాల వర్షం.. రైతులకు తీవ్ర నష్టం

- తడిసిన ధాన్యం రాశులు
- మిర్చి, ధాన్యం, మొక్కజొన్న పంటలకు నష్టం
- ఈదురు గాలుల బీభత్సం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం




దేవరపల్లిలో కురుస్తున్న వాన


దేవరపల్లి: బలమైన ఈదురు గాలులు, అకాల వర్షంతో మెట్ట రైతులు అతలాకుతలమయ్యారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మెట్ట ప్రాంతంలో బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోగా, తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాలు వీధి దీపాలు లేక అంధకారంతో ఉన్నాయి. యర్నగూడెంలోని బస్టాండ్ సమీపంలో నిత్యం జనసంచారం ఉండే ప్రాంతంలో గాలులకు కొబ్బరి చెట్టు విరిగి ప్రధాన రోడ్డుపై పడింది. అ సమయంలో అక్కడ జనం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ధాన్యం, మిర్చి, అరటి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. కళ్లాల్లోని ఎండుమిర్చి, రోడ్లపై ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం పూర్తిగా తడిచి ముద్దయయ్యాయి. ధాన్యం రాసులపై బరకాలు కప్పినప్పటికీ రాసుల అడుగు భాగం నుంచి వర్షం నీరు ప్రవహించడంతో ధాన్యం తడిసింది. ఎగుమతికి సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు తడిశాయి. దేవరపల్లి మండలంలోని సూర్యనారాయణపురం, యర్నగూడెం, దేవరపల్లి, దుద్దుకూరు, గౌరీపట్నం గ్రామాల్లోని రైతులు ధాన్యాన్ని హైవే సర్వీసు రోడ్లపై ఆరబెట్టారు. అకాల వర్షానికి ధాన్యం తడిసినట్టు రైతులు తెలిపారు. అరటి తోటలు పడిపోయినట్టు రైతులు తెలిపారు. నాలుగు రోజుల వ్యవధిలో రెండుసార్లు ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఈదురు గాలులకు ప్రధాన రహదారిపై కూలిన కొబ్బరి చెట్టు



గౌరీపట్నంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం రాశులపై బరకాలు కప్పిన రైతులు



దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద రోడ్డుపై వర్షానికి తడిసిన ధాన్యం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com